పారిశుద్ధ్యంపై పట్టింపేది?


ఇటిక్యాలలో మురుగు కుంటగా మారిన వర్షపునీరు

- పల్లెల్లో కరువైన పరిశుభ్రత
- విచ్చలవిడిగా పారుతున్న మురుగు
- వ్యాప్తి చెందుతున్న క్రిమి, కీటకాలు

ఎర్రవల్లి: ముసురు వర్షాల కారణంగా ఏర్పడిన మురుగుతో ప్రజలు అవస్థలు పడుతున్నా, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉన్నా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇళ్ల మధ్యనే ఏర్పడిన మురుగు, చెత్త క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారి దోమలు, ఈగల వృద్ధితో అనారోగ్యం బారిన పడుతున్నట్లు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన పరిశుభ్రత

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవల్లి, బీచుపల్లి, ఇటిక్యాల, పుటాన్‌దొడ్డి, సాసనూలు, దువాసిపల్లి, గార్లపాడు, ధర్మవరం, వల్లూరు, వేముల, చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల, పెద్దదిన్నె, కొండేరు, బుడ్డారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపంతో అల్లాడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల పదవీకాలం ముగిసిన అనంతరం ప్రత్యేక అధికారుల సారథ్యంలో నిర్వహిస్తున్న పాలనలో పారిశుద్ధ్య చర్యలు కనీసం చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో డ్రెయినేజీలు ఉన్నా కార్మికులకు వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో శుభ్రం చేయడం లేదని పేర్కొంటున్నారు. చెత్త సమస్య కూడా వేధిస్తున్నట్లు వాపోతున్నారు.

ఫాగింగ్, బ్లీచింగ్ జాడే లేదు

వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లో వర్షపు నీరు మురుగు కుంటలుగా ఏర్పడుతుంది. కాలనీల్లో మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి పనులు చేపట్టకపోవడంతో ఈగలు, దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంది. డ్రెయినేజీ వ్యవస్థలు కూడా సక్రమంగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుందంటున్నారు.

పాలనకు పైసలు కరువు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ఖజానాలో నిధులు లేక అవస్థలు పడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో కనీస అవసరాలను తీర్చేందుకు గాను సొంత డబ్బులను సైతం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పని ఒత్తిడితో పాటు ఆర్థిక ఒత్తిడి కూడా తీవ్రమవుతుందని తెలుపుతున్నారు. కేవలం మల్టిపుల్ వర్కర్ల వేతనాలను మాత్రమే జీపీ అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుంది. మిగతా నిర్వహణ ఖర్చులు మాత్రం మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి నూతన పాలక వర్గాలు కొలువు దీరితేనే 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దోమలతో సతమతం



మండల కేంద్రంలో డ్రెయినేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షపు నీరు , మురుగు రోడ్లపై పారుతుంది. అదే విధంగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పారిశుద్ధ్య లోపంతో ఈగలు, దోమలు విచ్చలవిడిగా వ్యాప్తి చెందుతున్నాయి.

– వీరేష్, ఎర్రవల్లి

రోడ్లపై పారుతున్న మురుగు



మండల కేంద్రంలో రోడ్లపై మురుగు విచ్చలవిడిగా పారుతుంది. దీనివల్ల దుర్వాసనతో పాటు అనారోగ్యాల బారిన పడుతున్నాం. మురుగు, వర్షపు నీరు కుంటలుగా ఏర్పడటంతో ఈగలు, దోమలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయి. రాత్రుళ్లు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

– శేఖర్, గ్రామస్తుడు, ఇటిక్యాల

కార్యదర్శులకు సూచిస్తున్నాం



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిత్యం కార్యదర్శులకు సూచిస్తున్నాం. పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలకు బదులు ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. అవసరమైతే ఫాగింగ్ చేయిస్తాం.

– అజార్ మొహియుద్దీన్, ఎంపీడీఓ, ఇటిక్యాల


ఎర్రవల్లిలో స్వైర విహారం చేస్తున్న పందులు


బుడ్డారెడ్డిపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు


చాగాపురంలో రోడ్డు పక్కన పారుతున్న మురుగు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మల్దకల్: మండలంలోని అమరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజస్విని రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేష్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో తేజస్వినిని ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరణ

మానవపాడు: మండల కేంద్రంలో పశు వైద్యశాలలో అధికారిగా శుక్రవారం పుష్పలత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల ప్రజలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. పశు యజమానులు సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ముందస్తు టీకాలు వేయించాలి

మానవపాడు: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యఅధికారి వెంకటేశ్వర్లు అన్నారు. జబ్బువాపు, గొంతువాపు, గాలికుంటు, చిటికె తదితర వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందజేస్తుందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పశువైద్య సిబ్బందితో గత మాసంలో నిర్వహించిన పశుగణన రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి పుష్పలత, డాక్టర్ హరిప్రియ, భీసన్న, జూనియర్ అసిస్టెంట్ భామయ్య, భారతి, మంగమ్మ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మందుల కొరత

అయిజ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత వేధిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పీహెచ్‌సీని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 863 రకాల మందులు అందుబాటులో ఉండాల్సి ఉండగా 266 రకాల మందులు మాత్రమే ఉన్నాయన్నారు. పీహెచ్‌సీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వైద్యులకు ప్రభుత్వం 3 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. పీహెచ్‌సీలో మందులు లేకపోవడం, మౌలిక వసతుల లేమితో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించని యెడల నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులుపాల్గొన్నారు.

గద్వాలను హరిత పట్టణంగా తీర్చిదిద్దాలి



గద్వాలటౌన్: జిల్లా కేంద్రాన్ని హరిత పట్టణంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కలను నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించి వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధ్యాపకులు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మీనాక్షి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

అలంపూర్: ఉండవెల్లి మండలంలోని పుల్లూరు గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా 1000 మొక్కలను దొడ్ల డైరీ లిమిటెడ్ ఆవరణలో నాటి పేర్లు పెట్టారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రోత్సాహక అధికారి భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉమాకాంత్, సుబ్బారెడ్డి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఇటిక్యాల: ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శివనంపల్లి, గోపల్‌దిన్నె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పరిసరాలు, వంటగదులు, తరగతి గదుల నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నిబంధనలు పకడ్బందీగా పాటించాలి


ఉత్తనూరులో శిక్షణలో పాల్గొన్న బీఎల్వోలు

అయిజ: ఓటర్ జాబితాలో పేర్లు నమోదు చేసే బీఎల్వోలు పకడ్బందీగా పని చేయాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తనూరు గ్రామంలో రెండో రోజు బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితాలో పాటించాల్సిన నింబంధనల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

అలంపూర్: పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాలలో బూత్‌స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ మంజుల అధికారులకు శిక్షణ ఇచ్చారు. అలంపూర్, ఉండవెల్లి మండలాల బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటి తహసీల్దార్ ధణీశ, ఆర్‌ఐలు దుర్గాసింగ్, మాసుం బాష తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభ్యున్నతికి కృషి

గద్వాలటౌన్: ప్రియదర్శిణి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో మహిళలకు ఉన్నత విద్యలో మరిన్ని కోర్సులు అందించడానికి కృషి చేస్తానన్నారు. అధ్యాపకులు సైతం మెరుగైన బోధన అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి విషయ పరిజ్ఞానం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, ప్రిన్సిపాల్ మీనాక్షి, మాజీ వైస్ చైర్మన్ బాబర్, మురళీ, సాయిశ్యామ్, సుదర్శన్, కృష్ణ, శ్రీను, యోగి తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

ధరూరు: మండల పరిధిలోని అల్వలపాడు ఎంపీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని గ్రామస్తులు అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్ ప్రతాప్, రామకృష్ణ, సీకే రంగన్న తదితరులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారని, 10 తరగతులకు గాను 7 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. అప్పటి నుంచి తామే వలంటీర్లను నియమించుకుని సొంతంగా జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సరిపడ ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతుందన్నారు. పలుమార్లు ఎంఈఓకు విన్నివించామని పేర్కొన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రమేష్, నర్సింహులు, కుర్వ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేస్తున్న అల్వలపాడు గ్రామస్తులు

గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి

గద్వాలటౌన్: జిల్లాలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాఠకులతో కలిసి బీఆర్‌ఎస్వీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్‌తో బీఆర్‌ఎస్వీ నాయకులు వాగ్వివాదానికి దిగారు. పాఠకులు సైతం సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మాట్లాడారు. జిల్లా గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు.


జిల్లా గ్రంథాలయం ఎదుట నిరసన చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

మూతబడిన పాఠశాల పరిశీలన

మల్దకల్: మండలంలోని ఎద్దులగూడెం గ్రామంలో రెండు సంవత్సరాలుగా మూతబడి ఉన్న ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గ్రామస్తులతో మాట్లాడారు. మూతబడిన పాఠశాలలో ఉపాధ్యాయులను వెంటనే నియమిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సీఆర్పీ పరుమన్న, విజయ్ పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్: మండలంలోని గొందిమల్ల గ్రామ సమీపంలో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో స్థానిక పోలీసులు ఆంజనేయులు, సురేష్ పుష్కరఘాట్ వద్దకు ప్రజలను అప్రమతం చేశారు. నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నదిలో ప్రవాహం ఎక్కువగా ఉందని తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

లీకేజీలకు మరమ్మతు చేపట్టాలి

అలంపూర్: మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీ మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జీకే ఈదన్న కోరారు. మండల పరిధిలోని లింగనవాయి గ్రామంలోని న్యూప్లాట్స్ కాలనీలో మిషన్ భగీరథ లీకేజీలను సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై తాగు నీరు వృథాగా పోతుందన్నారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నెల రోజులు కావస్తున్న కనీసం మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రహీం, రామచంద్రుడు, వెంకటరమణ, శ్రీనివాసులు, సిద్ధూ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలి

రాజోళి: ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగుళాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఆయన్ను మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పనిచేసే ఆశా కార్యకర్తలు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తల సేవలను ప్రభుత్వాలు గుర్తించకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం, యూనిఫాం, రిజిస్టర్లు, పెన్నులు అందచేయాలని డిమాండ్ చేశారు. సుజాత, అనిత, మంజుల, విజయలక్ష్మి, రామలక్ష్మి, రేణుక, జయంతి తదిదరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ సూత్రాలను విస్మరించి చట్టాలు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

అలంపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ మూల సూత్రాలను విస్మరిస్తూ చట్టాలను చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సీపీఐ మండల మహాసభలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళ్లు అర్పించారు. జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భూస్వామ్య, రాజరిక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ అనేక పోరాటలు చేసి విజయాలు సాధించిందన్నారు. పేద ప్రజల హక్కుల కోసం అనేక త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ అన్నారు. బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తూ అందల మొక్కుతుందన్నారు. దేశంలో ప్రశాంత వాతవరణం లేకుండా చేస్తుందని ఆరోపించారు. ప్రశ్నించే వారిని హింసిస్తుందని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 23, 24న గద్వాల జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం అలంపూర్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యదర్శిగా పెద్దబాబు, సహాయ కార్యదర్శులుగా మద్దిలేటి, పరుశురాం, కమిటీ సభ్యులుగా నర్సింహ్మ, గణేష్, బాబు, రంజిత్, మాబు బాష, రమేష్, మద్దిలేటిని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా రంజిత్, సహాయ కార్యదర్శులుగా మద్దిలేటి, బాబు, కమిటీ సభ్యులుగా పర్శురాం. శంకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుర్వ హక్కుల సాధనకు పోరాడాలి

రాజోళి: మాదాసి మాదారి కుర్వ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలోని బీరప్పస్వామి ఆలయంలో నిర్వహించిన ఎన్నిక కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడారు. మాదాసి కుర్వల హక్కుల సాధనకు పోరాడాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడిగా వెంకట్రాముడు, కార్యనిర్వహక అధ్యక్షుడిగా దేవేంద్ర, ఉపాధ్యక్షుడిగా రంగస్వామి, కోశాధికారులుగా ఎల్లోజి, తిరుపతి, ప్రచార కార్యదర్శిగా బోరవెల్లి హరికృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మద్దిలేటి, శ్రీనువాసులు, హుస్సేన్, తిరుపతయ్య, వీరన్న, చిన్నయ్య రాముడును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మాదాసి కుర్వల సంక్షేమానికి, వారి హక్కుల సాధన, వివక్షను పారదోలేందుకు పోరాడతామని పేర్కొన్నారు.


నియామక పత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

నాణ్యమైన భోజనం అందించాలి


కేజీబీవీ విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న డీసీసీబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి

ధరూరు: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీసీసీబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యోగేందర్, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ టెస్టుల ఫలితాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని డీసీసీబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ టెస్టులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ గోమతి తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ నాయకుల ముందస్తు అరెస్ట్

రాజోళి: ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరుద్యోగ జేఏసీ నాయకులు తలపెట్టిన చలో సెక్రటేరియట్‌లో భాగంగా జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. శుక్రవారం నిరుద్యోగ జేఏసీ నాయకుడు క్రాంతిని పెద్దతాండ్రపాడులో అరెస్ట్ చేసి రాజోళి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో తమ హక్కులను కాలరాయలేరన్నారు. నిరుద్యోగుల తరఫున తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో నాయకి ధర్మ, రాజేష్, చిన్న, మహేష్, కుర్వ రఘు ఉన్నారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు

గట్టు: నిరుద్యోగులు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, మండల అధ్యక్షుడు రామిరెడ్డిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షల మంది నిరుద్యోగులు ఎంతో ఆశగా ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. నిరుద్యోగుల గుండె ఘోషను ప్రభుత్వం విని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


రాజోళి పోలీసుస్టేషన్‌లో నిరుద్యోగ జేఏసీ నాయకులు

‘స్థానిక’ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేద్దాం

గట్టు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబి జెండా గ్రామగ్రామాన ఎగర వేద్దామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్గెర హనుమంతునాయుడు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్ జెండాను మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ నుంచి సంత బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. భవాని ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమంతునాయుడు మాట్లాడుతూ.. ప్రతి పల్లెలో మళ్లీ కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చాలా మంది రైతులకు మొండి చేయి చూపినట్లు ఆరోపించారు. అబద్ధపు హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులు పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రాఘవేంద్రరెడ్డి, శ్రీనివాస్‌గౌడు, చక్రధర్‌రావు, అంగడి బస్వరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బల్గెర హనుమంతునాయుడు

పార్టీలో చేరిక..

కాంగ్రెస్ పార్టీకి చెందిన బోయలగూడెం కేకేసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు లింగన్న, ఇందువాసి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బస్వరాజు, తిమ్మప్ప, కర్రెప్ప, ఇంజన్న, సురేష్, గోవర్ధన్, తిమ్మప్ప బీఆర్‌ఎస్‌లో చేరారు. హనుమంతునాయుడు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

మహనీయులకు ఘన నివాళి


గట్టు తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు

అలంపూర్: ఉండవెల్లి మండల కేంద్రంలో ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యార్థుల సంఘం సభ్యులు వెంకట్‌గౌడ్, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం రోశయ్య జయంతి వేడుకలను, దొడ్డి కొమరయ్య వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కరుణాకర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో జయంతి వేడుకలు

గట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మాజీ సీఎం కొనిజేటి రోశయ్య జయంతి, దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐలు రాజు, నాగిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల తనిఖీ

మల్దకల్: మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలు, సీఎస్‌సీ ఇంటర్నెట్ కేంద్రాలను శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్రాల వారు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు మద్దిలేటి, మహేందర్ పాల్గొన్నారు.